రంగంలోనే కాదు అన్నిచోట్ల వుంటాయి. మానవ నైజమే అంత.

ప్రత్యర్థులు: ప్రత్యర్థిత్వం అన్న మాటనే నేను అంగీకరించను. ఇక్కడ అందరికీ పని వుంది. ఎవరి పని వారు చేసుకుంటున్నారు. నాకు నెంబర్ల గేంలో నమ్మకం లేదు. ఇలాంటి వాటి గురించి ఆలోచించి బుర్ర పాడుచేసుకునే కన్నా పనిలో ధ్యాస పెంచుకుంటే మంచిది.

వయసు: వార్ధక్యం అంటే వాపోవాల్సిన అవసరం లేదు. సినీ పరిశ్రమలోముసలి తనానికి స్థానం లేదు. అసలు ఆడాళ్లు 36 ఏళ్లు పైబడ్డాకే బావుంటారు. అప్పుడే వాళ్లలో పిల్లతనం పోయి స్త్రీత్వం వస్తుంది. నాలా సెక్సీగా వుంటారు. డింపుల్, హేమమాలిని వారి యవ్వనంలో కన్నా ఇప్పుడే అందంగా వున్నారు.

వివాహం: వివాహ వ్యవస్థ మీద నాకు నమ్మకం వుంది. కానీ ఈ రోజుల్లో చాలామంది వివాహం, విడాకులు రెండూ ఒకే బండికున్న రెండు చక్రాలను కుంటున్నారు. పెళ్ళంటే పెడాకులు కాదు. సహనం వుండాలి. ఒక మగవాడ్ని పెళ్లి చేసుకుంటే, అతని కుటుంబానికీ ఇందులో పాత్ర వుంటుంది. దానికి విలువవివ్వాలి.

కోపం: నాకు ముక్కు మీద కోపమని అనుకుంటారందరూ. కానీ అది నిజం కాదు. నాకు ఇరిటేషన్ ఎక్కువ అంతే. ఒకోసారి అవతలి వాళ్లు మూర్ఖంగా ప్రవర్తించినపుడూ సహనంగా వుండలేం. కోపాన్ని ప్రదర్శించలేం. అలాంటపుడు వారితో మూర్ఖంగా ప్రవర్తించడమో శ్రేయస్కరం.

## మినీ కథ



# మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్

—సంగంబండ జగన్నాథ రెడ్డి

తల్లిదండ్రులు మేనమామ కూతురు రోజాను పెళ్లిచేసుకోమని ఎంత చెప్పినా రవికిరణ్ ససేమిరా కాదన్నాడు. పైగా మేనరికాలు, దగ్గరి సంబంధాలు చేసుకోవడం మంచిది కాదని శాస్త్రజ్ఞులు చెబుతున్నారని బదులు చెప్పారు. సమాజాన్ని ప్రభావితం చేసే సినిమాలో మేనరికం అధికంగా చూయిస్తున్నారు. అంతేగాక చుట్టుపక్కల అలాంటి సంబంధాలు చేసుకొన్న వారెందరో సుఖంగా కాపురం చేసుకొంటున్నారు. ఆమాటకొస్తే తనది మేనరికమే అని తండ్రి చెప్పినా "నా పెళ్లి చింత మీకెందుకు నాన్నా! చక్కని అమ్మాయిని మీ కోడలిగా తెస్తాలే" అని నిక్కచ్చిగా చెప్పాడు తండ్రికి రవికిరణ్.

రవికిరణ్‌కు ప్రేమించి పెళ్లిచేసుకోవాలని మొదటి నుంచి మహా ఇదిగా ఉంది. అందుకే తన ఆఫీసులో టైపిస్ట్‌గా పనిచేస్తున్న లతతో సఖ్యతగా ఉంటూ రాసుకు పూసుకు తిరిగేవాడు. సినిమాలు, షికార్లు కూడా తిరిగారాయిద్దరు. "లతా! నిన్ను పెళ్లిచేసుకోదలిచాను. మీ పెద్దలతో మాట్లాడా?" అన్నాడోరోజున ఆమెతో ఉన్న చనువుతో.

"సారీ.. రవీ ఆ ఒక్కటీ అడక్కు. ప్రేమ వేరు, పెళ్లి వేరు. నువ్వు ఆటెండర్‌వి, నేను టైపిస్ట్‌ని. నా పైస్థాయి వాళ్లతోనే నా పెళ్లి జరుగుతుంది" కుండ బద్దలు కొట్టేసినట్లుగా చెప్పింది లత. తనతో చెట్టాపట్టాలేసుకు తిరిగిన లత అలా చెప్పడంతో కపట ప్రేమకు గుడ్‌బై చెప్పాడతడు.

ఎలాగైనా చక్కని అమ్మాయిని ఆదర్శ వివాహం చేసుకోవాలని ఓ సుముహూర్తాన పట్టుదలతో ఓ దిన పత్రిక పెళ్లిపిలుపు శీర్షిక తిరగేసేవాడు. అమ్మాయికి ప్రైవేటులో మంచి ఉద్యోగం. చక్కని అందం. సాంప్రదాయ కుటుంబం. తగిన వరుడు సంప్రదించవచ్చని కేరాఫ్ ఆ పత్రిక పోస్ట్‌బాక్స్ నెంబర్ చిరునామా చూసి తన వివరాలతో ఉత్తరం రాశాడు రవికిరణ్. వారంరోజులలో అమ్మాయి తనకు అబ్బాయి నచ్చాడని, అన్ని విధాలా సరిజోడని, తమ జాతకాలు కూడా దివ్యంగా ఉన్నాయి కానీ తమది సాంప్రదాయ కుటుంబం కాబట్టి తల్లిదండ్రులను సంప్రదించమని తన ఫొటో పంపుతూ వారి అడ్రస్‌తో రిప్లై ఇచ్చింది. రిప్లై చదివిన రవికిరణ్ పెళ్లిచూపులు కూడా అక్కరలేదని అమ్మాయి పెద్దలతో మాట్లాడి ముహూర్తం పెట్టించమని తండ్రికి ఉత్తరం రాశాడు. ఆమె ఎవరో కాదు తన మేనకోడలు సరోజ. మేనరికమే వద్దని భీష్మించిన అతడు మేనకోడలును పెళ్లిచేసుకోవడంతో తెలిసిన వారంతా మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అని అందుకే అన్నారేమోనని అనుకొన్నారు.

◆